15న సంత్‌సేవాలాల్ జయంత్యోత్సవాలు

- సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 11: ఈ నెల 15న మిర్యాలగూడలో సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో బంజారా సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ జయంతి వేడుకల సందర్భంగా మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎన్నెస్పీ క్యాంప్‌లోని బంజారా భవన్ వరకు జరిగే ర్యాలీకి బంజారాలు, బంజారా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరిబాబు, ఎంఈఓ బాలాజీనాయక్, బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మాలోతు దశరథనాయక్, తిరుపతి, భాష్యా నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వాలి

- డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్

త్రిపురారం, ఫిబ్రవరి 11: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దదేవులపల్లి, త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆశ కార్యకర్తలు గర్భిణులకు అందుబాటులో ఉండి ప్రతినెలా వైద్య పరీక్షలకు తీసుకు రావాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు కేస రవి, గీతా వాణి, ఫార్మాసిస్ట్ సూపర్‌వైజర్ వీరారెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు రమావత్ శంకర్, ప్రియాంక, సూపర్‌వైజర్లు పుట్ట గోపాల్‌రెడ్డి, వెంకటయ్య, కీరాబాయి, మోతీలాల్, సీహెచ్‌ఓ వెంకటయ్య ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థుల ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చిట్యాల, ఫిబ్రవరి 11 : చిట్యాలకు చెం దిన ఉప్పలపల్లి సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి మిత్రులు (2003-04 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు) మంగళవారం సైదులు ఇంటికి వెళ్లి అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అతడి పిల్లల చదువుల నిమిత్తం రూ.40వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుక్కల మోహన్, శ్రీశైలం, బాలమణి, అనిత, సంతోష, లింగస్వామి, శ్రవణ్, సైదులు, సాయి, ఉపేందర్ పాల్గొన్నారు.

స్వాహా చేసిన డబ్బును రికవరీ చేస్తాం

- ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బాలం నర్సింహ

మాట్లాడుతున్న చైర్మన్ బాలం నర్సింహ

మర్రిగూడ, ఫిబ్రవరి 11 : పాలకవర్గం తీర్మానం లేకుండా సొసైటీ డబ్బులను వ్యక్తిగత అవసరాలకు వాడుకున్న ముగ్గురు ఉద్యోగుల నుంచి రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బాలం నర్సింహ స్పష్టం చేశారు. మండలంలోని శివన్నగూడెం రైతు సేవా సహకార సంఘంలో ఉద్యోగులు డబ్బులను స్వాహా చేసిన అంశంపై మంగళవారం నమస్తే తెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన చైర్మన్ పాలకవర్గాన్ని సమావేశ పర్చి ఈ విషయమై చర్చించారు. డబ్బుల స్వాహాపై ఇప్పటికే డీసీసీబీ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆడిటింగ్‌లో డబ్బులు స్వాహా చేసినట్లు తేలిందని, సదరు ఉద్యోగులకు గత నెల 24న డీసీసీబీ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయినట్లు చెప్పారు. వారు వినియోగించుకున్న డబ్బులు సకాలంలో సొసైటీకి చెల్లించకపోతే క్రిమినల్ కేసు నమోదు చేయించడంతో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు హెచ్చరికలు జారీ చేసినట్లు వెల్లడించారు.

పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11 : తమ ఇండ్లముందు, పొలాల వద్ద కొట్టంలో కట్టేసిన పశువులను ఎత్తుకెళ్తున్న ముఠాను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి యాదయ్య జనవరి 22న తన వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన పశువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు చేశారు. గుండబోయిన రామకృష్ణ (తాళ్లగడ్డ, మిర్యాలగుడ), షేక్ యూసుఫ్ (షాబునగర్, మిర్యాలగూడ), , పూల లక్ష్మణ్ (పూలగుడెం, చలకుర్తి)పై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా తామే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి ఏడు గేదెలు, రెండు ఆవులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. వీరు డిండి, దేవరకొండ, యాచారం, కొండమల్లేపల్లి ప్రాంతాల్లో పశువులను దొంగిలించినట్లు ఎస్ఐ చెప్పారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసును ఛేదించిన కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్యగౌడ్, ఎస్ఐ రామ్మూర్తి, సిబ్బందిని దేవరకొండ ఏఎస్పీ మౌనిక అభినందించారు.

బైక్ దొంగతనం కేసులో నిందితుడికి జైలు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11 : బైక్ దొంగతనానికి పాల్పడిన నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ దేవరకొండ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కేవీఎస్ హరీశ్‌బాబు మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాద్‌రోడ్డులో కిరణా షాపు ఎదుట పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని గత సంవత్సరం అక్టోబర్‌లో కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండంలోని కంచర్ల గ్రామానికి చెందిన కొప్పు నగేశ్ దొంగిలించాడు. వాహన యజమాని అయిన దేవరకొండకు చెందిన సన్నగళ్ల మల్లేశ్ కొండమల్లేపలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ కేసులో నిందితుడు కొప్పు నగేశ్‌ను అక్టోబర్ 20, 2024న పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆరునెలల జైలుశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు. ఈ కేసులో అన్ని ఆధారాలు సేకరించి నిందితుడికి శిక్షపడేలా చేసిన పోలీసు సిబ్బందిని జడ్జి అభినందించినట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చందంపేట(నేరేడుగొమ్ము), ఫిబ్రవరి 11 : నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామానికి చెందిన రైతు కేతావత్ చెన్నా వ్యవసాయ పొలం వద్ద మంగళవారం విద్యుత్ తీగలు తగిలి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అడవి పందుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన కరెంటు తీగలు తగలడంతో అతను మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకులాల్లో మెనూ పాటించాలి

- పీహెచ్‌సీల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

చండూరు, ఫిబ్రవరి 11: గురుకులాల్లో మెనూ పాటించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మంగళవారం చండూరు మండలం బోడంగిపర్తి గ్రామంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి వస్తున్నందున విద్యార్థులకు నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణకు సూచించారు. అంతకు ముందు చండూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పీహెచ్‌సీకి కొత్త భవనం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్డీఓ శ్రీదేవి, తాసీల్దార్ దశరథ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, చండూరు వైద్యాధికారి రాజు ఉన్నారు.

ఆవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గోవులను కబేళాలకు తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని చింతచెట్టుతండా పరిధిలోని జేత్యతండా నుంచి బొలేరో వామనంలో 10 గోవులను హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్నారన్న సమాచారంతో స్థానిక చౌరస్తా వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. గోవులను తరలిస్తున్న హనుమంతు, గణేశ్, జహంగీర్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న గోవులను రంగారెడ్డి జిల్లాలోని వెల్దండ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

సీపీఎం నాయకుడి మృతికి పలువురి సంతాపం

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 11: కనగల్ మండలం దర్వేశిపురం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు జీనుకుంట్ల అంజయ్య సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. వివిధ పార్టీల నాయకులు మంగళవారం అంజయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కానుగు లింగస్వామి, బీఆర్ఎస్ నాయకులు కరీంపాషా, దర్వేశిపురం ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మర్రిగూడ, ఫిబ్రవరి 11 : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఎంఈఓ జటావత్ చంద్రుడు నాయక్, భవానీ ప్రాపర్టీస్ వైస్ ప్రెసిడెంట్ కాసాని జానయ్య మంగళవారం స్టడీ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉదావత్ లచ్చీరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో ధాన్యం వివరాలు రిజిస్టర్‌లో పొందుపర్చాలి

- ఎన్‌ఫోర్స్‌మెంట్ టీడీ రఘునందన్

మర్రిగూడ, ఫిబ్రవరి 11 : రైస్‌మిల్లుల్లో ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్ సూచించారు. మంగళవారం మర్రిగూడ శివారులోని రైస్‌మిల్లును ఆయన తనిఖీ చేశారు. మిల్లు యజమానులు రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమ దందాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మేక అపహరణ

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 11 : కనగల్ మండలం జి.చెన్నారం గ్రామంలోని మేకల దొడ్లలోంచి సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 13 మేకలను ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. చెన్నారం గ్రామానికి చెందిన ఉప్పునూతల సైదులుకు చెందిన 10 మేకలు, కట్ట అంజయ్యకు చెందిన 3 మేకలను దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం తమ దొడ్లలో మేకలు లేక పోవడంతో బాధితులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేక పోయింది. దాంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

నాయకులకు బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్‌ను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

బీఆర్ఎస్ నాయకులకు డైరీ, క్యాలెండర్ అందజేత

హాలియా, ఫిబ్రవరి 11 : బీఆర్ఎస్ పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యులకు మంగళవారం మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పార్టీ డైరీ, క్యాలెండర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండి వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, నిడమనూరు మండల నాయకుడు బొల్లం రవి, పెద్దపూర మండలాధ్యక్షుడు జఠావత్ రవినాయక్, హాలియా పట్టణాధ్యక్షుడు వడ్డె సతీశ్ రెడ్డి, నాయకులు పామోజు వెంకటాచారి, బొల్లం సైదులు, నాయకులు సురభిరాంబాబు, యూత్ అధ్యక్షుడు కాట్నం నాగరాజు గౌడ్, శ్రీకర్‌నాయక్, ఉపేందర్, ఆదిమల్ల భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనగల్ పోలీస్ కానిస్టేబుళ్లకు నగదు పురస్కారం

కానిస్టేబుల్‌కు నగదు పురస్కారం అందిస్తున్న ఎస్పీ

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 11: కనగల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లకు మంగళవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో నగదు పురస్కారం అందించారు. కనగల్ మండలంలోని పర్వగిరి గ్రామ శివారులో గతంలో జరిగిన మహిళ హత్య కేసులో దోషికి జీవిత ఖైదు పడేలా కృషి చేసిన కోర్టు కానిస్టేబుళ్లు శంకర్, నగేశ్‌తో పాటు, పోలీశాఖ నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన మహిళా కానిస్టేబుల్ బేబి శాలినికి ఎస్పీ రివార్డులు అందించినట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- డీఈఓ భిక్షపతి

మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 11 : ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ పరిజ్ఞానాన్ని మెరుగు పర్చుకోవాలని డీఈఓ భిక్షపతి సూచించారు. మంగళవారం మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైస్కూల్ ఉపాధ్యాయులంతా డిజిటల్ బోధనపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను అందించడంలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన

నకిరేకల్, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామచంద్రయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని నోముల బాలికల ఉన్నత పాఠశాలలో నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూర్, కేతేపల్లి మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులకు ఐఎఫ్‌బీ బోర్డుల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ మేక నాగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎం. చల్లరాజు, ఆర్పీలు బి.వెంకటేశం, పి.శంకర్, కె.వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే తగిన గుణపాఠం తప్పదు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 11: స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచనప్పుడు కులగణన సర్వే ఎందుకు చేశారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట మార్చడం సరికాదన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఈ విషయంపై ముఖ్యమంత్రిని నిలదీయాలని కోరారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న జర్నలిస్టు అరెస్టు

- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

నీలగిరి, ఫిబ్రవరి11: ప్రభుత్వ అధికారులను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న క్రైమ్ మిర్రర్ డిజిటల్ పేపర్ రిపోర్టర్ నాగుల ఆనంద్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. క్రైమ్ మిర్రర్ డిజిటల్ పేపర్‌ను పెట్టుకొని తనకు పరిచయమున్న తుప్పరి రఘు, పేరబోయిన ఆంజనేయులు సహకారంతో నల్లగొండ జిల్లాతోపాటు వికారాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్తులను లక్ష్యంగా చేసుకొని తప్పుడు, కల్పిత సమాచారంతో అసత్య వార్తలను ప్రచురిస్తూ వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయం సోషల్‌మీడియాలో ప్రచారం కావడంతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పనిచేసే కొంపల్లి మత్స్యగిరి కూడా తనకు జరిగిన అన్యాయంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాంతో ఆనంద కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా మరికొన్ని దురాగతాలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

అధికారి పేరు చెప్పక పోవడంపై ఆంతర్యమేంటి..?

పోలీస్, ఇతర శాఖల అధికారులను బెదిరించి డబ్బులు వసూలు చేసిన క్రైం మిర్రర్‌కు చెందిన ముగ్గురు జర్నలిస్టులకు పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఒక సర్కిల్ అధికారి, మరో కానిస్టేబుల్ సహకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులకు సమాచారం అందించడం ద్వారా వారి దురాగతాలకు సహకరించిన సీఐ, కానిస్టేబుల్‌పై విచారణ జరుగుతుందని ఆయన చెప్పారు. కానీ వారి పేర్లు మాత్రం బయట పెట్టలేదు. సదరు సీఐ ఆనంద్‌కుమార్‌కు అనేక మార్లు డబ్బులు, కానుకలు అందించినట్లు సమాచారం. సదరు సీఐపై గతంలో కూడా అనేక ఆరోపణలు వచ్చాయి. ఇటీవల మహిళ హత్య కేసులో నిందితుల నుంచి కొంత నగదును తీసుకొని విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో తాను తప్పుకొని ఎస్ఐని బలిచేశాడనే విమర్శలు వినిపించాయి.

పాత బీర్లకు.. కొత్తరేటు

- వైన్స్ యాజమాన్యాల ఇష్టారాజ్యం

నల్లగొండ, ఫిబ్రవరి 11: నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైన్స్ యజమానులు మంగళవారం పాత బీర్ల ధరలు పెంచి విక్రయించారు. ఇదేమని అడిగిన వారిని బెదిరింపులకు గురి చేసినట్లు మందు ప్రియులు వాపోయారు. రాష్ట్రంలో బీర్ల ధరలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఒక్కో బీరుకు రూ.30 చొప్పున పెంచింది. అయితే పెరిగిన ధరలు కొత్త బీర్ల స్టాక్‌పై మాత్రమే వర్తింపజేయాల్సి ఉంది. కానీ జిల్లాలోని 154 మద్యం దుకాణాలు, 20 బార్ల యాజమాన్యం పెరిగిన ధరలను మంగళవారం నుంచి అమలు చేశాయి. పాత బీర్లను రూ.30 పెంచి విక్రయించాయి. పాత బీర్లను కొత్త ధరకు అమ్మడం ఏమిటని మద్యం ప్రియులు నిలదీస్తే వారిపై బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. మంగళవారం నుంచి బీర్ల ధరల పెరుగుతాయనే ఆలోచనతో ముందస్తుగానే డిపో నుంచి బీర్లను వైన్స్‌లకు సరఫరా చేయలేదు. అయితే అప్పటికే వైన్స్‌లో ఉన్న పాత బీర్లను రూ.30 అదనంగా పెట్టి విక్రయించి యానమాన్యం క్యాష్ చేసుకుంది. ఈ విషయంపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్‌ను వివరణ కోరగా పాత ధరలనే పరిగణలోకి తీసుకొని విక్రయించాలని, కొత్త ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే డిపోలో ఉన్న బీర్లను పెంచిన ధరలతోనా లేదా పాత ధరలతోనే సరఫరా చేయాలా అనేది రేపు తెలియజేస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలి

- జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

గట్టుప్పల్ టీచర్లకు సలహాలిస్తున్న సంక్షేమ అధికారి కృష్ణవేణి

మునుగోడు/గట్టుప్పల్, ఫిబ్రవరి11 : అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమయ పాలన పాటించాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి ఆదేశించారు. మంగళవారం మునుగోడు, గట్టుప్పల్ మండలాల్లోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే ఆహార పదార్థాల నాణ్యతను చెక్ చేసుకున్న తర్వాతే తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆమె వెంట ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు శివేష, యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలాల పరిశీలన

వక్ఫ్‌బోర్డు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మునుగోడు, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని సర్వేనంబర్ 10లో ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలాన్ని మంగళవారం వక్ఫ్‌బోర్డు అధికారులు పరిశీలించారు. బోర్డు స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. తనిఖీ చేసిన వారిలో వక్ఫ్‌బోర్డు నల్లగొండ జిల్లా వర్కఇన్‌స్పెక్టర్ మహ్మద్ అలీ, హైదరాబాద్ కార్యాలయ ఏఈ అసదుల్లా స్థానిక మైనార్టీ నాయకులు ఉన్నారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సుచిత్రసేనా

పాడి పశువుల నుంచి శాంపిల్స్ తీసుకుంటున్న డాక్టర్ సుచిత్రసేనా

త్రిపురారం, ఫిబ్రవరి 11: పశువుల ఆరోగ్యం పట్ల పెంపకందారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సుచిత్రసేనా సూచించారు. మంగళవారం మండలంలోని త్రిపురారం దుబ్బలో ఐసీఆర్, డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రీసెర్చ్ రాజేంద్రనగర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పాడిపశువులు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల్లో సూక్ష్మజీవుల నిరోధక శక్తిని తెలుసుకునేందుకు శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదుడు జంతువుల్లో రోగ నిరోధక శక్తి, వాటికి అందించే ఆహారం, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సూక్ష్మజీవుల నిరోధక శక్తి లేని జంతువులకు టీకాలు వేయడం, వైద్యం చేయడం ద్వారా దానిని సరి చేయవచ్చన్నారు. ఆమె వెంట పశువైద్యాధికారి సీహెచ్.నాగేంద్ర, సిబ్బంది రాహుల్ ఉన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టాలి

- సీడీపీఓ మమత

మిర్యాలగూడ, ఫిబ్రవరి 11: ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన